క్లుప్తంగా

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తకోట రూరల్: ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీపై 90శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్154 ద్వారా 'వన్ టైం సెటిల్‌మెంట్' నిర్ణయం తీసుకుందని, పట్టణంలో ఆస్తి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సైదయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31వరకు ఉంటుందన్నారు. పట్టణాభివృద్ధి కోసం నల్ల బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించి మున్సిపాల్ అధికారులకు సహకరించాలని కోరారు.

రేపు గోపాల్‌పేట సంతవేలం

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే కూరగాయల సంత 2025–26 సంవత్సరానికి సంబంధించి శనివారం రోజు వేలం నిర్వహించనున్నట్లు గ్రామ సెక్రటరీ బాల్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు శనివారం ఉదయం పది గంటలకు గోపాల్‌పేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు రావాలని కోరారు. రూ.5 వేల నగదు లేదా చెక్కు రూపంలో డిపాజిట్ చేయాల్సి ఉంటుందని చెప్పారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



గోపాల్‌పేట: ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న స్నేహితుడు ఆంజనేయులు కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని తోటి స్నేహితులు భరోసా కల్పించారు. పదో తరగతి చదివిన స్నేహితులు గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 11,100 అందించారు. భవిష్యత్‌లో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

సృజనాత్మకతను పెంపొందించాలి



ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలోని కేపీటీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్, ఎస్‌బీఐ బ్యాంకులు సందర్శించారు. గురువారం పాఠశాల హెచ్‌ఎం అనురాధ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌ఐ నరేందర్ పోలీసుల విధులు, చట్టాలు తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. బ్యాంకులో అధికారులు ఖాతాదారులకు అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడ్యుకేటర్ కృష్ణయ్య, ఐఆర్‌పీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



వేణు(ఫైల్)

కొత్తకోట రూరల్: గొర్రెలు కాసేందుకు జీతం కుదిరిన బాలుడు(16) తప్పిపోయిన ఘటన వనపర్తి పెద్దమందడి మండలం జంగమాయపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గోపాల్‌పేట మండలం పాలికెపాడు గ్రా మానికి చెందిన కావలి వేణు(16) జంగమాయపల్లి గ్రామానికి చెందిన రాంచంద్రయ్య దగ్గర గొర్రెలు కాసేందుకు మూడు నెలల క్రితం జీతం కుదిరాడు. గొర్రెల దగ్గర కాపల ఉన్న వేణు ఈనెల 26న ఉదయం బాత్‌రూం వెళ్లివస్తానని యజమానికి చెప్పి తిరిగి రాలేదు. దీంతో బాలుడి తండ్రికి ఫోన్ ద్వారా యజమాని సమాచారం అందించాడు. చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల దగ్గర వెతికినా సమాచారం దొరకలేదు. దీంతో బాలుడి తండ్రి బంగారయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తలిపారు.

ఆర్థిక సాయం అందజేత



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 14వ వార్డుకు చెందిన నారమన్ శేఖర్ (51) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. స్థానిక కాలనీ వాసుల ద్వారా సమాచారం తెలుసుకున్న జీఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వహకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జీఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు భక్తరాజు, అమృతరాజు, రమేష్, జయరాజు, సతీష్‌రాజు, ఎస్.రవి, బాబు, ఎస్.చినబాబు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు నిరంతరం కృషి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: మహిళా సాధికారత, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు జిల్లాలో వంద శాతం విజయవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఉదయం సీఈఓ, సెర్ప్ దివ్య దేవరాజన్, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. యూబీఐడీ సదరం, భర్త/భార్య చనిపోయిన వారికి వృద్ధాప్య పెన్షన్ అమలు, శాశ్వత వలసలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, ఎస్.హెచ్‌జీ గ్రూపుల ద్వారా పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టడం, జిల్లాలో పెట్రోల్ బంక్ ఏర్పాటు, ఎస్.హెచ్‌జీ గ్రూపులకు రుణ బీమా, మరణ బీమా సదుపాయం అమలు అనే అంశాలపై కలెక్టర్లతో చర్చించి తగు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ వనపర్తి జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ, జెడ్పీ సీఈఓకు సూచించారు. ప్రతి మండలంలో ఒక గోదాం, రైస్ మిల్లు ఏర్పాటు చేసే విధంగా మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో మహిళల ద్వారా ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలం కేటాయించి అది త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మహిళా సంఘాలకు పాఠశాల విద్యార్థుల యూనిఫారం కుట్టేందుకు ఆర్డర్లు ఇవ్వడం జరిగిందని, జూన్ 2 నాటికి ఒక జత యూనిఫారం కుట్టి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇందిర మహిళా శక్తి బజార్ ఏర్పాటు..

జిల్లాలో ఇందిరా మహిళా శక్తి బజారు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉత్పత్తి అయ్యే లేదా జిల్లాకు బ్రాండ్ పేరు ఉన్న వస్తువులు ఈ మహిళా బజారులో అమ్మే విధంగా మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ స్థానంలో యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు ఇచ్చే విధంగా సదరం స్లాట్‌లు ఏర్పాటు చేసి దివ్యాంగులు అందరికీ యూబీఐడీ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వృద్ధాప్య పింఛన్లు..

నిరుపేద కుటుంబంలోని 57 ఏళ్లు దాటిన ఒకరికి వృద్ధాప్య పింఛన్ ఇవ్వడం జరుగుతుందని, వారికి భర్త గాని, భార్య గాని చనిపోతే భర్త లేదా భార్యకు వృద్ధాప్య పింఛన్ బదలాయించాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామం, మండలం వారీగా చనిపోయిన వృద్ధాప్య పింఛనుదారుల నివేదిక తెప్పించుకోవాలన్నారు. మూడు నెలల కంటే ఎక్కువ కాలం పింఛను తీసుకోకుండా శాశ్వత వలస పోయిన వారి వివరాలు సేకరించాలన్నారు.

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్)..

ఈ పథకం కింద స్వయం సహాయక సంఘంలో ఉన్న సభ్యుల కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, వనపర్తి జిల్లాలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

రుణ బీమా, ప్రమాద బీమా..

స్వయం సహాయక సభ్యురాలు ప్రమాద వశాత్తు మరణించిన లేక శాశ్వత అంగ వైకల్యం పొందిన రూ.10 లక్షల బీమా అందించడం జరుగుతుందని, జిల్లాలో ఎవరైనా సభ్యురాలు ప్రమాద వశాత్తు మరణిస్తే వారికి బీమా సౌకర్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ..

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌డీ) ద్వారా ఇది ప్రారంభించబడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్పాన్సర్ బ్యాంకుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే ఈ సంస్థను త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. గ్రామీణ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని వ్యవస్థాపకులుగా మార్చవచ్చన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, పీడీ గ్రామీణాభివృద్ధి శాఖ ఉమాదేవి, డీపీఎం అరుణ, ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ పాండే, డీఈఓ మహమ్మద్ గని, తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



రేమద్దులలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: క్షయ వ్యాధి నిర్మూలన 100రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చి నిర్వహించే వ్యాధి నిర్ధారణ పరీక్షల కార్యక్రమం మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. గురువారం మండలంలోని రేమద్దులలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలన కోసం కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం గ్రామానికే అంబులెన్స్‌లో మొబైల్ ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేసే యంత్రాలు వచ్చి అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నిర్ధారణ పరీక్షలు చేయించుకొని క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వ్యాధి గ్రస్తులకు నిశ్చయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.1000 అందజేస్తారన్నారు. అనుమానితులందరూ సహకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కోఆర్డినేటర్ ఖాజా, ఎక్స్‌రే టెక్నీషియన్ సురేందర్, ఎంఎల్‌హెచ్‌పీ లారెన్స్, వైద్య సిబ్బంది సతీష్‌కుమార్, రాంచందర్, శాంతమ్మ, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



ఆత్మకూర్: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని అధైర్యపడాల్సిన అవసరరం లేదని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ నాయకులు పుట్నాల రమేష్, సురేష్‌ల మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీను, విరేషలింగం, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవికుమార్, నాయకులు కోటేష్, రామకృష్ణ, చెన్నయ్య, సోంబాబు, జానకిరాం, రియాజ్, విష్ణురెడ్డి, అంజి ఉన్నారు.

వైద్య సేవలో నిర్లక్ష్యం వీడాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్

పెబ్బేరు/వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు నిర్లక్ష్యాన్ని వీడాలని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న వైద్య వసతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నెలవారి నివేదికల తయారీలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించరాదని, గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం వైద్య సిబ్బంది బాధ్యతగా భావించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్స్ హేమవర్ధన్, శ్వేత, కరుణశ్రీ, భాగ్యలక్ష్మి, కేశవులు, వైద్య సిబ్బంది దయామణి, కలమ్మ, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రుణాలివ్వాలి



పాన్‌గల్: గతంలో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే రుణాలు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తెల్లరాళ్ళపల్లితండాలో ఎస్టీ కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో కార్పొరేషన్ రుణాలను ఎత్తివేసే కుట్రలను మానుకోవాలన్నారు. గతంలో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం జిల్లాలో 181 మందిని ఎంపిక చేసిందని, ఎంపిక చేసిన వారికి నేటికి చెక్కులు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాలు ఇస్తామని చెబుతుండటంతో గతంలో కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులు అయోమయంలో పడ్డారన్నారు. దీంతో గతంలో ఎంపికైన వారికి రుణాలు ఇస్తూ ప్రస్తుత పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణాలు ఇవ్వాలని లేనిచో గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు బాబునాయక్, రవినాయక్, చిట్టెమ్మ, అనిత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న పల్లెపాగు ప్రశాంత్

కొత్తకోట: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశం మేస్త్రీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీచుపల్లి యాదవ్ మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి నిర్వహించే పాదయాత్ర మండలంలోని అన్ని గ్రామాలను కలుపుతూ ప్రజలకు అర్థమయ్యేలా సాగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, యువ వికాసం గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి తెలియజేస్తామన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ మాట్లాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

- మదనాపురం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షులు గజ్జెల నాగన్న అధ్యక్షతన సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ అంశాలను బలంగా ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



వనపర్తి మండలంలో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

వనపర్తి రూరల్: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మండలంలోని పెద్దగూడెం, మెంటెపల్లి, కడుకుంట్ల, నాసనల్లి మాజీ సర్పంచ్‌లను వనపర్తి రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా పెద్దగూడెం మాజీ సర్పంచ్ కొండన్న మాట్లాడుతూ మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లను ప్రభుత్వం అరెస్టులు చేయించడం సరైన నిర్ణయం కాదని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

- ఖిల్లాఘనపురం మండలంలోని మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సర్పంచులు తమ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి అసెంబ్లీ ముట్టడికి పిలుపు నివ్వడంతో ప్రభుత్వ ఆదేశం మేరకు వారిని ముందస్తు అరెస్టు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటరమణ, దేవేందర్, తిర్మలేష్, సాయిలు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించండి

శాంతినగర్: వాతావరణ కాలుష్యంతో పాటు ప్రజలకు హాని కలిగిస్తున్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరతూ వడ్డేపల్లి ఎంపీడీఓ రామకృష్ణకు గురువారం విద్యార్థి సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. విషపూరితమైన కోనో కార్పస్ చెట్ల వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. స్పందించిన ఎంపీడీఓ ఉన్నతాధికారుల దృష్టికి సమాచారం అందజేసి వారి ఆదేశాల మేరకు చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు బీసన్న, రవి, శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి నిరంతరం కృషి



సింగల్‌విండో కార్యాలయం లో రైతులకు పంట రుణాల విత్‌డ్రా ఫాంలు అందిస్తున్న చైర్మన్

ఖిల్లాఘనపురం: రైతుల సంక్షేమం కోసం సింగల్ విండో ద్వారా నిరంతరం కృషి చేస్తామని సింగల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగల్‌విండో కార్యాలయం దగ్గర చైర్మన్ మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైన పంటరుణాలు, ఎల్‌టీ రుణాలు, ఎరువులు తదితర వాటిని సకాలంలో అందిస్తు వారికి వెన్నంటి ఉంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సాయిచరణ్‌రెడ్డి, తోక కృష్ణయ్య గౌడు, సత్యశీల రెడ్డి, ఎదిరె నారాయణ, వనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, కార్యదర్శి ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్వాకంతో గ్రామసభ వాయిదా



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లి లో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన తరువాత సర్పంచు లేకపోవడంతో గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి గ్రామసభ నిర్వహించి ప్రజల అభీష్టం మేరకు పనులు ఎక్కడ చేపట్టాలి, ఎవరు చేపట్టాలని నిర్ణయిస్తారు. కాని ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో ప్రభుత్వం నుంచి మంజూరైన జాతీయ ఉపాధిహామీ మెటీరియల్ కాంపోండెంట్ నిధులకు సంబందించి ఎలాంటి గ్రామసభ నిర్వహించకుండా, తీర్మానం ఇవ్వకుండా గ్రామంలోని కొందరు వ్యక్తులు పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌నాయుడు సహకారంతో పనులు పూర్తి చేశారు. తీర అట్టి పనులకు సంబందించి బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర సీసీరోడ్లు ఎక్కడ నిర్మించాలి, ఎవరు నిర్మించాలనే విషయమై గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీఓ వెంకటాచారి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభకు వచ్చిన గ్రామస్తులు పనుల విషయమై ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. గ్రామానికి ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి మొత్తం రూ.13 లక్షలు మంజూరైనట్లు చెబుతున్నారు. ఆ నిధులపై గ్రామసభలో చర్చించడం గాని, తీర్మానం ఇవ్వడం గాని జరగకుండానే పనులు పూర్తి చేశారు. పనులు పూర్తి అయిన తరు వాత ఇప్పుడు గ్రామసభ నిర్వహించడం ఏమిటని అధికారులను నిలదీశారు. పనులు చేసిన విషయం తమకు తెలియదని, వాటికి ఎట్టి పరిస్థితుల్లో తీర్మానం ఇవ్వడం జరగదని ఎంపీడీఓ తెలిపారు. ఎలాంటి తీర్మానం లేకుండా పంచాయతీరాజ్ ఏఈ ఎలా పనులు చేయించారో తెలియాలని పేర్కొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై గందరగోళం..

అప్పారెడ్డిపల్లి గ్రామానికి ప్రభుత్వం నుంచి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎస్సీవాడలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేయాలని నిర్ణయించారు. ఈ విషయమై గత గ్రామసభలో చర్చించగా ఎస్సీవాడలోని యువకులు ముందుకొచ్చి పనులు తామే చేస్తామని సభ దృష్టికి తెచ్చారు. దీంతో గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మొదట్లో ఓ వ్యక్తి పేరు రాయించిన యువకులు అనివార్య కారణాల వల్ల ఆ వ్యక్తి పేరుకాకుండా, మరో వ్యక్తి పేరున తీర్మానం ఇవ్వాలని అడిగారు. అందుకు ఎంపీడీఓ ఒప్పుకోలేదు. దీంతో గ్రామస్తులు ఎంపీడీఓను నిలదీయడంతో గ్రామ సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామ సభ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి ఎంపీడీఓ వెళ్లి పోయారు. పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌నాయుడును వివరణ కోరగా, తనకు రూ.5 లక్షలకు సంబందించి తీర్మాన ఇచ్చినట్లు తెలిపారు. మిగతా రూ.8 లక్షలకు ఎలాంటి తీర్మానం ఇవ్వలేదన్నారు. తీర్మానం ఇస్తేనే ఎంబీ చేస్తానని లేకుంటే వదిలేస్తామని చెప్పారు. తీర్మానం ఇస్తాం అన్నందుకే పనులు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్‌గౌడు, లక్ష్మయ్య, కృష్ణయ్య, పరమేశ్వర్, విష్ణు, మల్లేష్, రమేష్, చెన్నయ్య, కృష్ణయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలకు ట్విన్నింగ్ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఖిల్లాఘనపురం: ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థులకు ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలోని పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. మండలంలోని వెంకటాంపల్లి, కమాలొద్దీన్‌పూర్ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐదో తరగతి విద్యార్థులను మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలకు తీసుకొచ్చి అక్కడి పరిస్థితులు, చదువు, మౌలిక వసతులు తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కాళిదాసు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బస్టాండ్ మరమ్మతు



అమరచింత: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మరమ్మతులు కొనసాగుతున్నాయి. బస్టాండ్‌లో మౌలిక వసతులు లేవు. బస్టాండ్ గోడలు నెర్రెలు వారడంతో వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. మరమ్మతుల కోసం ఆర్టీసీ ద్వారా రూ.లక్ష 50 వేలు మంజూరు కావడంతో వీటితో త్వరితంగా మరమ్మతులు చేపడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, గుర్తించిన వనపర్తి డిపో మెనేజర్ తాత్కాలిక మరమ్మతులకు నిధులను మంజూరు చేశారు. నిరుపయోగంలో ఉన్న మరుగుదొడ్లను మరమ్మతులు చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

- మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



పాన్‌గల్ ఇఫ్తార్‌లో పాల్గొన్న ఒబేదుల్లా కొత్వాల్



వనపర్తిలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు



కొత్తకోట నూర్ మసీదులో ఇఫ్తార్‌కు హాజరైన ముస్లింలు

వనపర్తి/పాన్‌గల్/ఆత్మకూర్/కొత్తకోట: పాన్‌గల్ మండల కేంద్ర వాసి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ఆధ్వర్యంలో గురువారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని జామియా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

- వనపర్తి పట్టణంలోని ముస్లింలకు 22వ వార్డులోని ఈద్గా మసీదులో మెకానిక్ శ్రీను దావత్ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వాజిద్‌అలీ ఖాన్, మహమ్మద్ ఆరీఫ్, సమీర్, కాలీద్, జాహిద్ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్ పట్టణంలోని అజంజాహి మసీద్‌లో, ముస్లింయూత్ ఆధ్వర్యంలో, నూర్ మసీదులో, కాంగ్రెస్ నాయకుడు రఫిక్ ఆధ్వర్యంలో, ఖాద్రీ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ అలీంరశాది, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఖాదర్, ఆమీర్, ఖాజ, అఖీల్, మహిమూద్, ఫేరోజ్, ముక్తార్, పాష, అఫ్రోజ్, జుబేర్ పాల్గొన్నారు.
- కొత్తకోట పట్టణం 9వ వార్డులోని మసీదులో ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎజాజ్ అలీ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే సోదరుడు జి.భాస్కర్‌రెడ్డి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జే.బోయేజ్, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌సాగర్, సలీంఖాన్, తయ్యబ్, లతీఫ్ ఉన్నారు.